# పునర్జీవితం

## హిరణ్మయీదేవి



బెర్త్ సీటులో సూట్‌కేస్ పెట్టి తన సీట్లో కూర్చున్నాడు సీతారామరాజు. కర్చీఫ్ తీసి మొహం తుడుచుకొని కాస్త రిలాక్సయ్యాడు. యధాలాపంగా ఎదుటి సీట్లో కూర్చున్న యువతి వైపు చూస్తూనే - కాస్త నిటారయ్యాడు. ఆమె నెక్కడో చూసిన ఫీలింగ్...పరిచయం వుండీ - లేనట్లుగా వింతయిన భావం. ఎక్కడ చూసేనంటూ గుర్తు చేసుకో సాగాడు...

"నీజ్ఞాపకశక్తి షూకుంటేనా" అంటార తని స్నేహితులు, పరిచయస్థులు మెచ్చుకోలుగా. రెండు నిమిషాలు కళ్ళు మూసుకొని గుర్తు తెచ్చుకొన్నాడు. నిజాని కది ఎక్కువ టైం తీసుకోవడమే అతని విషయానికొస్తే ... చటుక్కున గుర్తుకొచ్చింది.

తన పత్రికలో "తిరుగుబాటు" అనే కధకి కన్సొలేషన్ బహుమతిని ఇచ్చాడు. ఆకధకి రచయిత్రి ఈమె. 'ఫోటో - పరిచయం' లో చూశాడు. తన గురించి ఏమీ చెప్పుకోలేదామె. 'సింధువు లాంటి ఈ రచనా వ్యాసంగం లో ఓ బిందువుని" అని చెప్పుకొన్న ఆమె నిరాడంబరత తన కెంతగానో నచ్చింది ఇంకా కొంత ప్రోత్సాహమిస్తే - అతి స్వల్ప కాలంలో గొప్ప పేరు సంపాదించు కోగలదని తను భావించడం వల్ల అలా గుర్తుండి పోయింది. ఫోటోలోని మొహం అదీగాక తన పత్రికలో వచ్చే ప్రతీచిన్న శీర్షికకు ఆమె నుండి వచ్చే రెస్పాన్స్ వల్లను గూడా ఆమె పేరు తనకి బాగా 'టచ్' లో వుంది. పేరు... పేరు 'శ్రీలేఖ' యస్ శ్రీలేఖే

ఆలోచనల్లో నుండి తేరుకుని ఆమె వైపు చూశాడు. కిటికీలో నుండి అవతల కన్పించే మనోహర ధృశ్యాలని చూడ్డంలో నిమగ్నమయింది. నుదుటిన మెరిసే ఎర్రటి కుంకుమ అభాలభానునితో పోటీపడుతున్నట్లుగా వుంది. గులాబీరంగు చీర ఆమె ఒంటి రంగులో కలిసిపోతు న్నట్లుగా వుంది. పవిత్రమైన భావాన్ని కల్గించే అపురూపమైన అందాన్ని ఇముడ్చుకొన్న ఆమెలో అదో నిర్లిప్తత. ప్రక్కన కూర్చున్నది ఆమె భర్తేమో - సీతారామరాజు చూపుల్ని గమనించి కొరకొరా అతని వైపు చూశాడు. అది గమనించిన సీతారామరాజు చూపు మరల్చుకొన్నాడు. మనసులో 'గిల్టీ' గా ఫీలౌతూ మళ్ళీ ఆలోచనలలో మునిగిపోయాడు.

ఆమె తనని చూసిందనుకొంటూ. మళ్ళీ ఇంకోసారి ఆమె తనని చూస్తే గుర్తుపడుతుంది. తనవో ఫేమస్ ఎడిటర్‌గా చాలామంది గుర్తిస్తారు. మరి ఈమె చూపుల్లో ఎలాంటి మార్పూ లేదేం? ఆమె తనని గుర్తు పట్టక పోవడంతో అదోలా ఫీలయ్యాడు.

తనని చూడాలని -కలుసుకొని మాట్లాడాలని ఉవ్విళ్ళూరే జనాల్ని చూశాడింత వరకు. ప్రయాణాలెంతో ఇష్టమైనా - ఆ ప్రయాణాలని తప్పించుకోవడానికి ప్రయత్నిస్తాడంటే - ఓ విధంగా పాఠకులు కల్పించే యిబ్బంది వల్లనే. తన క్లోజ్ ఫ్రెండ్స్ అంటుంటారు గూడా "ఒక్క సినిమా హీరోలని, రాజకీయ నాయకుల్ని, పేరున్న రచయితలని మాత్రమే ఎగబడి చూస్తారనుకున్నాం ఇంతవరకూ - ఆ లిస్ట్‌లో నిన్నూ చేర్చాలోయ్" అని. తనెక్కడయినా కన్పిస్తే ప్రశ్నలతో ఊపిరాడనివ్వక పోవటం - చేసేవారికే ఓ విధంగా అలవాటుపడ్డ అతనికి వాళ్ళు తనవో అనామకుడిలా ట్రీట్ చేయడం కొంత అహాన్ని దెబ్బతీసింది.

అందుకే తన అలవాటుకి భిన్నంగా తనకై తనే మాట కల్పుతూ "ఎందాకా వెడుతున్నారండి ?" అనడిగాడు ఇద్దర్నీ ఉద్దేశించినట్లుగా...

తపోభంగం అయిన తపస్విలా ఆమె తలతిప్పి చూసింది. అంతేగానీ పెదవి కదల్చలేదు.

"రాజమండ్రి - గోదావరి స్టేషన్‌లో



దిగాలి" ముక్తసరిగా చెప్పాడు అతడు.

సంభాషణా చతురుడని పేరుపడ్డ ఆ మహా ఎడిటర్‌కి-అతనితో ఇంకెలా సంభాషణ పొడిగించాలో తోచలేదు. "ఏం చేస్తుంటారు? ఏమైనా ఏజాబ్ చేస్తున్నారు" అడిగాడు మళ్ళీ.

"పొగాకు వ్యాపారం" అనేసి పేపర్ చదవడానికే తను పుట్టానన్నట్టుగా - పేపర్‌లో తలదూర్చేశాడు. ఇక ఏం మాట్లాడలేక ఆమె వైపు చూశాడు. కళ్ళు మూసుకొని వుందామె. ఆమె మొహంలో సౌకుమార్యం. అమాయకత్వం పోటీపడుతున్నట్టుగా వున్నాయి. గాలికి నుదుటి మీద జీరాడుతున్న ముంగురులు వింతశోభని కల్గిస్తున్నాయామెకి.

ఆమె భర్త అడిగే ప్రశ్నలకి జవాబులు గూడా తలాడించి-చెప్పిందే గాని పెదవి విప్పని ఆమె వైఖరి ఎందుకో సీతారామ రాజుకి అమితమయిన ఆశ్చర్యాన్ని కల్గించింది. "కబుర్లకు మారుపేరు ఆడవాళ్ళు" అనేవాళ్ళకి ఈమెను చూపిస్తే టక్కున తమ అభిప్రాయం మార్చుకొంటారు.

ఏంటి తను ఇవాళ-ఇలా ఆలోచిస్తున్నాడామె గురించే ఓసారి గూడా పరిచయం లేని ఆమె గురించి అనుకుంటూ దృష్టి మళ్ళించడానికి తనింకా చేయవలసిన పనులని పునశ్చరణ చేసుకోసాగాడు. అంతే అప్పుడు అతని మెదడు నిండా ఆఫీస్ వ్యవహారాలే చోటుచేసుకొన్నాయ్. దీపావళి ప్రత్యేక సంచికకు కథలు పంపమంటూ కోరమని రచయిత(త్రుల) లిస్ట్ టైపిస్ట్‌కిచ్చాడు. అవి పోస్టయి వుంటాయీ పాటికి. వచ్చే సంచిక నుండి పిల్లలకోసం బొమ్మల సీరియల్ వేయాలనుకొన్నాడు ఆర్టిస్ట్ బొమ్మలేయడం కంప్లీట్ చేశాడో - లేదో...ఎంతో అద్భుతంగా బొమ్మలు గీసే ఆ ఆర్టిస్ట్ అవిటి(కుంటి) వాడని ఎవరికీ తెలియదు...

ఒక రోజు తన ఫ్రెండ్ ఇంట్లో తను గీసిన బొమ్మల్ని చూసి ఆశ్చర్యపోయాడు. కొంచెం ప్రోత్సాహమిస్తే ఇట్టే అల్లుకు పోగలడన్న నమ్మకంతో చేరదీశాడు. ఆతడిని చూసిన కొందరతడి ముందే "ఇంత కన్నా మంచి ఆర్టిస్ట్ దొరక లేదా" అంటూ అపహాస్యం చేశారు ఎందుకో తనకి అతడిలోని స్పార్క్ ఇట్టే కనబడడంతో వారి మాటల్ని లెక్క చేయలేదు. "ఓ రెండేళ్ళ తర్వాత చూడండి" అంటూ ఛాలెంజ్ చేశాడు. ఆ ఛాలెంజ్ తనదిగా భావించాడేమో పట్టుదలతో దీక్షతో - అనితర సాధ్యం అన్పించేలా బొమ్మలు గీయడంతో ఓ క్రొత్త వరవడిని సృష్టించాడు - అపహసించిన వాళ్ళే ముక్కున వేలు వేసుకొనేలా.... .

"ప్రతిభ అనేది ఎక్కడ వున్నా ఇట్టే పట్టేస్తాడు మన రాజు" అంటారు విజ్ఞులు - కానీ విమర్శించడమే ధ్యేయంగా పెట్టుకొన్న కొందరు మాత్రం "ఆడవాళ్ళనిమాత్రం బాగా ప్రోత్సహిస్తాడంటూ" అపవాదు వేశారు - పొగడ్తని - విమర్శనీ ఒక్కలాగే రిసీవ్ చేసుకొన్న అతనిని చూసి ఆశ్చర్య పోయేవాళ్ళే చాలామంది వున్నారు.

ఓ విధంగా చెప్పాలంటే - సున్నితమయిన భావాల్ని - సెంటిమెంట్స్‌ని రచయిత్రులు చెప్పినట్టుగా రచయితలు చెప్పలేరేమో అన్నంత అద్భుతమయిన రచనలని చేసిన రచయిత్రిగా శ్రీలేఖ తన మనసులో ఓ స్థానం సంపాదించుకొంది. ఆమె కథలకెన్నో బహుమతుల






నందుకొందామె. ఇంతకీ తన ఎదురుగా కూర్చున్నది ఆమెనో...లేక ఆమె పోలికతే వున్న ఆమె చెల్లెలో, అక్కనో... పోనీ పలుకరిద్దామంటే - అకారణంగా ఆమె భర్త కొరకొరా చూస్తున్నాడాయె.

ఆలోచనలతో చాలా టైమ్ గడిచిపోయిందతనికి. ఇంతలో 'నిడదవోలు' జంక్షన్ వచ్చింది. 'ఇదుగో నిన్నే, భోజనం పట్టుకొస్తాను - ఆ మర చెంబిలా ఇయ్యి' అన్నాడామెనుద్దేశించి. ఆమె లేచి వంగొని సీటుకింద వున్న మరచెంబుని తీసిచ్చింది - ఆదేనిర్లిప్తతతో. ఆ మర చెంబుని చూస్తూనే నవ్వొచ్చింది సీతారామరాజుకి సైజు చూస్తోనే....ఇంకా మర చెంబులే వాడుతున్నారీకాలంలో గూడా. అంటే "పాతభావాలకి రాజపోషకులన్న మాట" అనుకొంటూ

నిడదవోలు జంక్షన్ కావడం వల్ల ట్రైన్ చాలా సేపు ఆగింది.

హోటల్ భోజనమంటే ఇష్టపడదనే ఫలహారాన్ని టిఫిన్ బాక్స్‌లో పెడుతుంది, ప్రయాణాలప్పుడు సీతారామరాజు భార్య ఆ టిఫిన్ బాక్స్‌పై టకుతీద్దామా అనుకొని-వాళ్ళు భోంచేస్తున్నప్పుడే తనూ తీస్తే సరి అని - విరమించు కొన్నాడు.

అతను లేడుగా - ఓసారి ఆమెని పలుకరిస్తేనో అది సభ్యతగా వుంటుందా అని తటపటాయించినా - ఆసక్తి దాన్ని డామినేట్ చేయడంతో "చూడండీ" అన్నాడామెని ఉద్దేశించి. ఉలిక్కిపడి చూసిందామె. ఆ చూపుల్లో ఏదో భీతి - కలవరం.

ఎంత చదువుకొన్నా ఈ ఆడాళ్ళకి బెదురెప్పుడు పోతుందో అనుకొంటూ "ఏమన్నా మాగజైన్స్ వున్నాయా ?" అనడిగాడు సంభాషణకి నాందిగా.

'లేవు' అన్నట్టుగా తలాడించిందామె.

"మీరేమయినా పుస్తకాలు చదువుతుంటారా ?"

"ఉహు" అంది మెల్లిగా.

తనని తాను పరిచయం చేసుకొంటూ "ఆంధ్రవాణి" పత్రిక చదివారా ? దాని ఎడిటర్‌ని నేను-" అన్నాడు తనలోని 'ఇగో'ని చంపుకొంటూ.

"అలాగా" అన్నట్టు చూసిందంతే.

ఆ చూపుల్లో ఎలాంటి సంభ్రమంగానీ, ఆసక్తిగాని కన్పించక పోవడంతో నిరుత్సాహం కల్గింది రాజుకి - పైగా ఆమె

మొహంలోని ప్రసన్నత - శ్రావణమాసపు నీరెండలా మాయమైనట్లు తోచిందో క్షణం.

ఇంతలో ఆమె భర్త వచ్చాడు-వస్తూనే ఆమెవైపు అనుమానాస్పదంగా చూశాడు.

సీతారామరాజు పుస్తకం తెరిచి బలవంతాన తన కళ్ళకి పని చెప్పాడు. ఆలోచనలు మాత్రం ఆమెనుండి మరలి రానని మారాం చేస్తున్నాయి. ఎందుకో...

ఉగాది కథల పోటీలో బహుమతులని పొందిన వారి కథలతో పాటుగా - వారి ఫోటోలు - సంక్షిప్త పరిచయాలు వేయడమే కాకుండా వెరైటీగా ఉండాలని రచయిత (త్రు)ల-పాఠకులమధ్య స్నేహ పరిచయాలు వర్థిల్లాలన్నట్లుగా తమ కార్యాలయపు ఆవరణలో 'ఫంక్షన్' ఏర్పాటు చేశాడు. ఎందరో ఆహ్వానితులతో - మూర్తీభవించిన సరస్వతిలా కళ కళలాడింది ఆ సభ.

ప్రైజెస్ అందుకోవడాన్కి - బహుమతి పొందిన వారంతా వచ్చారుగాని, సెకండ్ ప్రైజ్ పొందిన శ్రీలేఖ రాకపోవడం తెలియని వెలితిని కల్గించిందారోజు. ఎంతో డబ్బు ఖర్చుచేసి సన్మానాలు చేయించుకొనే ఈ కాలపు రచయిత (త్రు) లకి శ్రీలేఖకి ఎంత తేడా! ఆమెందుకు రాలేదో అన్న ఆలోచన రెండుమూడ్రోజులు వేధించింది తనని.

అదంతా మరిచి రొటీన్ పడిన తనకి మళ్ళీ ఇప్పుడిలా ఈమె దర్శనం ...ఆలోచనలతో అతడికెంతో సేపు నిద్రపట్ట లేదు-గాని ప్రకృతి మాత్రం చీకటి కౌగిలిలోకి చేరిపోయింది.

తూర్పుకొండల్లో నుండి సన్నసన్నగా మొదలైన వెలుగు జగతినంతటిని ఆక్రమిస్తూండగా మెలకువ వచ్చింది రాజుకి. ఎదురుగా భానోదయం - ఎంతో మనోహరంగా కన్పిస్తోంది. మెల్లగా - ఎదుటి సీట్‌వంక చూశాడు. ఆమె అంతకన్నా ముందే ఎప్పుడు లేచిందో - యాంత్రికమైన మానవులంతా కోల్పోతున్న అనుభూతులని పొందడమే తన లక్ష్యం అన్నట్టుగా అరుణకిరణపు అందాలని చూస్తోంది.

రాజు లేచి బాత్‌రూం వైపు వెళ్ళి మొహం కడుక్కొని వచ్చాడు. వచ్చేసరికి ఆమె ఏదో బుక్ దీక్షగా చదువుతూ వుండడం గమనించాడు - ఆమె భర్త ఇంకా నిద్రనుండి లేవలేదు,


రాజుని చూస్తూనే ఓ క్షణం తత్తరపడినట్లయి - చదువుతున్న పుస్తకాన్ని ప్రక్కకు పెట్టేసిందామె,

రాజు ఆమెని పట్టించుకోనట్లే - తన సూట్‌కేస్ తెరిచి అరలో వున్న ఫోటోల కవర్ తెరిచాడు. ఆ సం॥ 'వికలాంగుల సంవత్సరం' జరుపుకొంటున్నారు కాబట్టి వికలాంగులలో - కొన్ని ప్రత్యేకమైన కళలలో నేర్పరులయిన కొందరి ఫోటోలని ముఖచిత్రంగా వేయాలన్న ఊహలో కలెక్ట్ చేసిన ఫోటోలవి. అవి ఏ వరుస క్రమంలోవేస్తే బావుంటుందో ఆలోచిస్తూ, పెన్సిల్‌తో - ఆ ఫోటోల వెనుక నెంబర్స్ వేస్తూ - ముఖచిత్రంలో కనీసం పది మంది ఫోటోలు రావాలి అనుకొన్నాడు.

ఇంతలో గోదావరి స్టేషన్ వచ్చింది. అతడు హడావుడి పడుతూ అన్నీ దించుతున్నా - ఆమె మాత్రం మౌనంగా - అదే నిర్లిప్తతతో చూస్తూండిపోయింది. అతడు విసుక్కొంటున్నా.

వెళ్ళేముందోసారి రాజువంక చూసింది ఆ చూపులో ఏదో అర్థంగాని భావం...






ఆ చూపు కేభాష్యం చెప్పుకోవాలో ఓ క్షణం పాటు తోచలేదు రాజుకి.

* * *

రాజమండ్రి స్టేషన్ రాగానే దిగిన రాజు - ఇక పూర్తిగా తన పనులలో బిజీ అయిపోయాడు, అతడికెప్పుడూ లీలామాత్రంగాగూడా గుర్తుకు రాలేదు శ్రీలేఖ ఆ వారం రోజులు.

హైద్రాబాద్‌కి తిరిగొచ్చాక ఆఫీస్‌కెళ్ళి తన పనుల్లో నిమగ్నమయ్యాడు. ఆర్డినరీ లెటర్స్‌కి సబ్‌ఎడిటర్ రిప్లయ్స్ ఇచ్చేస్తాడు. ముఖ్యమయిన పోస్ట్ మాత్రం రాజుకోసం అట్టేపెడతారు. ఆ లెటర్స్ చూస్తుండగా 'పర్సనల్' అని తన పేరు వ్రాసిన గులాబీరంగు కవర్‌మీద దృష్టి నిల్చిపోయింది.

చిరపరిచితంగా తోచిన ఆ దస్తూరిని చూస్తూనే కవర్ విప్పాడు. మనస్తత్వాన్ని తెలియజేస్తాయి అక్షరాలు అంటారు. అదే నిజమైతే ఈ లెటర్‌లోని అక్షరాలు వారి స్థిరమయిన మనస్తత్వాన్ని తెలియజేసేలా వున్నాయి అనుకొంటూ చూపు సారించాడు.

"ఎడిటర్ గారికి,

నమస్తే. నేను ... శ్రీలేఖను. ఓ పది రోజుల క్రితం మనం ట్రెయిన్‌లో కలుసుకొన్నాం - గుర్తొచ్చాననుకుంటాను. మిమ్మల్ని గుర్తించని ఓ మూగబొమ్మలా వుండిపోయి మీ మెదడుకి పని కల్పించినందుకు క్షమించండి.

రచయిత్రిగా ఇంతో - అంతో పేరు సంపాదించుకొన్నా - ఓ భర్తచాటు భార్యని నాకంటూ వున్న స్వతంత్ర భావాలని అర్థం చేసుకోలేని భర్తని పొందినందుకు ఎంతో విచారిస్తుంటాను. అంతకు మించి ఏమీ చేయలేని ఓ పిరికిదాన్ని. కథలు వ్రాసే కొత్తలో - ఎన్నో కథలు తిరిగొచ్చాయి. ఐనా నేను నిరుత్సాహ పడక పోవడాన్కి కారణం "ఎంతో పెద్ద రచయితల రచనలూ మేము నచ్చకుంటే త్రిప్పి పంపుతాం కొద్దిగా మార్పులుచేసి పంపితే ప్రచురిస్తాం" అని మీరు చేసిన సూచనలు - విమర్శలు మాత్రమే.

ఏ మనిషికైనా ఓ చిన్న పొగడ్త, ఆత్మీయత, అభిమానం వుంటే చాలు: తన రంగంలో అభివృద్ధి సాధించడానికి. అది మీనుండి పుష్కలంగా పొందిన నేను కట్టుకొన్న భర్తనుండి మాత్రం పీస

మెత్తయినా పొందలేకపోయాను. అది నిజంగా చాలా దురదృష్టం.

నన్నెంతగానో పొగిడేవారున్నా - ఆయన దృష్టిలో మాత్రం నాకే విలువ లేదు. ఎందుకొచ్చిన పిచ్చిరాతలంటూ నిరుత్సాహ పరుస్తారు. నేనో రచయిత్రినని ఎవరికీ తెలియకుండా వుండేందుకు ప్రయత్నిస్తుంటారు ... ఫోటోని గూడా పంపనివ్వరు .... ఏదైనా అత్యవసరపు పనిబడి నేను, పరాయి మగాడిని చూసినా, పలుకరించినా సహించలేరాయన. అందువల్లే నాల్గుగోడల మధ్యే మ్రగ్గిపోతూ -నాకంటూ వున్న ఆ చిన్న పరిధిలోనుండే రచనలు చేస్తూండడం పరిపాటై పోయింది.

ఆరోజు మిమ్మల్ని గుర్తించీ, పలుకరించలేని నా అసహాయతకి కుమిలిపోయాను. నా కృతజ్ఞతలు - క్షమాపణలు తెల్పుకుంటూ-(చూపుద్వారా మాత్రమే) దిగిపోయాను... అది మీకర్థమయి వుంటుంది.

మా పుట్టింట్లో -పూర్తిగా ప్రోత్సాహకరంగా వున్న వాతావరణం నుండి వచ్చిన నేను - రెక్కలు కత్తిరించి మరీ పంజరంలో బంధించినట్లున్న అత్తవారింటి వాతావరణాన్ని భరించలేకపోయాను... అది ఓ హీరోయిన్ కి వర్తింపజేసి ఆత్మహత్య ముగింపుగా ఓ కథ వ్రాసి పంపాను నేను. కానీ కథలో పరిపూర్ణత లేదంటూ - ఆత్మహత్య ముగింపుగా చూపడం నచ్చలేదంటూ మీరా రచన త్రిప్పి పంపారు. దాంతో నేను ఆత్మహత్య చేసుకోవాలన్న ఆలోచనను విరమించుకొన్నానంటే-బహుశా మీరు నమ్మలేరేమో-

ఓ సారి శృంగార కథల పోటీ కని ఎంతో సుతిమెత్తని శృంగారపు వర్ణనతో నేను వ్రాసిన కథని ప్రచురించడమేగాక బహుమతినిచ్చారు మీరు. కానీ దానిని చదివిన నా భర్త మాత్రం- "ఇంటి పరువు ప్రతిష్ఠలు బజార్నపడే రచనగా దాన్ని పేర్కొంటూ" ఎన్నో చీవాట్లు పెట్టారు. అడుగడుగునా అతని తిరస్కారాలు భరించలేని నేను అతనినుండి విడిపోవాలనుకొన్నాను. కానీ నాలో ప్రాణం పోసుకొంటున్న చిన్నారి గురించి-'రాజీ' పడాల్సి వచ్చింది.

నిజజీవితంలో ధైర్యాన్ని చూపించలేని నేను "ఏదైనా తిరుగుబాటుతత్వం" కథ వ్రాయాలనుకొన్నా "నిజాయితీలేని రచనలతో నువ్వు పొందుతున్నదేంటని" నిలదీసే మనసుకి సమాధానం చెప్పుకోలేక రచనా వ్యాసంగానికి ఫుల్‌స్టాప్ పెట్టేశాను.

పూర్వకాలపు ఆర్యోక్తి ప్రకారం స్త్రీ బాల్యంలో తండ్రి, యవ్వనంలో భర్త, వృద్ధాప్యంలో కొడుకుచాటున వారి యిష్టాలకు అనుగుణంగా వుండాలన్నారు. ఎంతో నాగరికతని సాధించామంటున్నా ఈ తరంలోనూ స్త్రీ అదే పరిస్థితికి లోబడే వుండవలసి రావడం విచారకరం. నా తండ్రి హయాంలో ఇంతో అంతో వ్రాశాను. భర్తకిష్టం లేదని వదిలేశాను- ఇక కొడుకు ఇష్టపడితే మాత్రం నా రచనా వ్యాసంగాన్ని సాగించాలి. ఇదంతా నేను నిర్ణయించుకొన్నది కాదు- మా తల్లితండ్రులు, బంధువులు, బలవంతాన నాకు బ్రెయిన్‌వాష్ చేయించి చెప్పిన మాటలు - చేయించిన పనులు.

భర్తను కాదని సంసారాన్ని కూలద్రోసుకొని - లోకులతోనూ, వారు చేసే కాకిగోలతోనూ బ్రతికే ధైర్యం లేక "రాజీ" పడి బ్రతుకు సాగిస్తున్న 'ఓ జీవచ్ఛవాన్ని'- అందుకే దీపావళి ప్రత్యేక సంచికకి కథని పంపమని మీరు వ్రాసినా పంపలేక పోతున్నాను.

నన్ను ప్రోత్సహించిన మీరుమాత్రం నాకెప్పుడూ గురుతుల్యులే. ఓ మంచి మనసున్న మనిషికిమారుపేరుగా ఎప్పుడూ నా గుండెల్లో నిలిచిపోయే విశిష్టమయిన వ్యక్తి మీరు.

బహుశా ఇదే నేను మీకు రాసే ఆఖరి లేఖ.

ఉంటానిక

నమస్కారములతో,

శ్రీలేఖ

అది చదవగానే మనసంతా భారంగా అయిపోయింది రాజుకి.

ఓ మణిపూస చేతుల్లోంచి జారిపోయిన ఫీలింగ్. భర్త నిరంకుశత్వం క్రింద అణగారి పోతున్న వారింకెంత మంది వున్నారో

పుస్తకాలలో, సినిమాలలో చూస్తే "స్త్రీ అభ్యున్నతి" నిజంగా. ఎప్పుడూ ఉస్సురంటు నిట్టూర్చడం తప్ప ఏమీ చేయలేని "అశక్తత" ఆవరించిందతణ్ణి.

క్రమక్రమంగా శ్రీలేఖని మరిచిపోయాడు రాజు. ఆరోజే మద్రాస్‌నుండి తిరిగొచ్చిన రాజుకి ఫోన్ చేశాడు సబ్ ఎడిటర్-"మరో సబ్ ఎడిటర్ కై ప్రకటించిన వారిని ఇంటర్వ్యూ చేసి-ముగ్గురిని ఎన్నుకొన్నానని - ఫైనల్‌గా మీరొచ్చి - నిర్ణయిస్తే-అందులో ఒకరిని సబ్ ఎడిటర్‌గా నియమించవచ్చని."

ఆ ఫోన్‌కాల్ రాగానే ఆలస్యం చేయకుండా - ఆఫీస్‌కి బయల్దేరాడు రాజు.

ఇద్దరితో ఇంటర్వ్యూ అయింది - మూడో అభ్యర్థిని పిలిచాడు. వచ్చిన యువతిని చూస్తూనే ఆశ్చర్యపోయాడతడు ఆమె శ్రీలేఖ - అంతే కాదు - 'అర్హత' లన్నీ వున్న అభ్యర్థి.

సీతారామ రాజుకి అప్పుడప్పుడో సందేహం వస్తూ వుంటుంది.

"మంచి పేరు ప్రఖ్యాతులతో సబ్ ఎడిటర్‌గా మారి తన వ్యక్తిత్వాన్ని నిలబెట్టుకున్న శ్రీలేఖ జీవితం సుఖాంతమైనట్టా లేక "భర్తకు దూరమై, సంసార సౌఖ్యాలకు దూరమై - ఒంటరిగా మిగిలిపోయినందుకు" దుఃఖాంతమైనట్టా అని.

శ్రీలేఖమాత్రం సుఖాంతంగానే ఫీలవుతోంది.

●

### దేవతా డ్రైవింగ్ స్కూల్

పురావస్తు పరిశోధనా సంస్థ వారు త్రవ్వకాలలో బయట పడిన ఓ రథంతోలే దేవతా విగ్రహాన్ని ట్రాఫిక్ పోలీస్‌లకు బహుమతిగా ఇచ్చారు. ఆ శిల్పం మీద దేవత రథం కుడివేపు తిరుగుతునట్లుగా చేయి జాపితే రథం తాలూకూ గుర్రాలు మాత్రం ఎడమ వేపుకి తిరుగుతోంది